"ఈ సంతలో కొనేవాళ్ళ దగ్గర డబ్బుకు కొదవలేదు. అమ్ముకునేవాళ్ళకు అన్నీ కరువే!"

# సంత

పి. గిరిజ

మునిసిపల్ ఎన్నికల హడావిడి.

ఊరంతా ఎన్నికల వాసన వేస్తోంది. ఆవేళ ప్రచారానికి ఆఖర్రోజు కావడంతో ప్రచారం మరింత వుధృతంగా సాగుతోంది.

ఆ వార్డులో పోటీ ప్రధానంగా చీమల సింహాచలానికీ కోడి అప్పల్నాయుడికీ మధ్య జరుగుతోంది. సింహాచలంది సింహంగుర్తైతే, అప్పల్నాయుడి గుర్తు పులి. సింహాచలంది బ్రాకెట్ కంపెనీ బంధుత్వం అయితే అప్పల్నాయుడి చిరునామా చిన్నారుల కంపెనీ. అందుచేత ఆ వార్డులో పోటీ కడు తీవ్రంగానూ, మరింత ఉత్సాహంగానూ కొండొకచో భయంకరంగానూ జరుగుతోంది.

ఆ రోజు సింహాచలం తరపున జరుగుతున్న ప్రచారం ఊరందరినీ ఆకర్షించింది. చివరిరోజు కావడాన సింహాచలం తన బావమర్ది సలహాపైన పెద్దాపురంనుంచి 'బేబీ రాణి' ని పిలిపించాడు. బేబీ మంచి పాటగత్తె ఆటగత్తె అని కూడా చురుకైన చదువరులు గ్రహించి ఉంటారు కానీ అది అప్రస్తుతం.

సింహాచలం తరపున ప్రచారం జరుపుతున్న మెటడోర్ వాన్లో రోజూ లాగే వదిహేనుమంది కుర్రాళ్ళు కూచున్నారు.



వాళ్ళతోపాటు స్పెషల్ ఎట్రాక్షన్‌గా 'బేబీ'ని కూర్చోబెట్టారు. 'బేబీ' గొంతెత్తి తన కమ్మని కంఠంతో సింహాచలాన్నీ సింహాన్నీ కీర్తిస్తూ ఆయన ఆస్థానకవి ఒకరు రాసిన పాటలు, పద్యాలు ఆలాపిస్తుంటే యిళ్ళల్లోని ఆడజనమంతా బయటకువచ్చి గుమ్మాల కంటుకుని వుండిపోయారు. మగజనం మటుకు మరో అడుగు ముందుకువేసి మెటడోర్ దోర్ల కంటుకు పోయారు

జనాన్ని చూసి బేబీ, బేబీని చూసి వేన్‌లో కుర్రాళ్ళు మరింత వుత్సాహపడిపోయి ప్రచారాన్ని తారస్థాయిలో కొనసాగించారు.

"ప్రజాసేవకుడు సింహాచలానికే మీ ఓట్లు...."

"వెయ్యాలి."

"సింహం గుర్తుకే మీ ఓటు ముద్ర.."

'.... వెయ్యాలి ....'

వేన్‌లో యిరుక్కుని కూచున్న ప్రకాశానికి మటుకు మహా యిబ్బందిగా వుంది. బేబీ వంటిమీంచి ఘాటుగా వస్తున్న సెంటు వాసన, కుర్రాళ్ళందరి దగ్గర్నుంచీ వస్తున్న చెమట కంపు, కొందరి దగ్గర్నుంచి వస్తున్న మంద మారుతం— అతనికి చిరాగ్గా వుంది. పదిహేను ఇరవై రూపాయల కోసం తను యిలా తిరగడమే అతనికి బాధగా వుంటే యివాళ యిలా ఒక సానిపాపకు వంత పలకవలసి రావడం అతనికి మరింత కష్టంగా వుంది.

'తననీ పరిస్థితిలో సుజాత చూస్తేనో' అన్న ఆలోచన వచ్చేసరికి అతను మరింత గిలగిల్లాడేడు.

సుజాత.

తన కలల పోగు.

తను కాలేజిలో వుండగా లెక్చరర్ల యిళ్ళ దగ్గర ట్యూషన్లే సర్వం అనుకుని క్లాసుల్లో అసలు శ్రద్ధ తీసుకోవడం లేదని తాను ఆందోళన లేవదీస్తే తన్ను అభినందించేందుకు తనను కలుసుకొంది మొదటి సారి

ఇద్దరూ కాలేజీ వదిలాక ఆ పరిచయాన్ని పదిలం చేసుకుంటూనే వున్నారు.

ఒకసారి ఒక ఆర్గ్యుమెంట్‌లో తాను "టాలెంట్ అండ్ మెరిట్ విల్ నెవర్ గో అన్‌రికగ్నైజ్డు" అని బల్ల గుద్దినట్లు వాదిస్తే, తన కలాంటి నమ్మకం లేదని చప్పరించేసింది సుజాత.

"ఐ విల్ ప్రూవిట్ యిన్‌మైలైఫ్" అన్నాడు తను దృఢంగా.

"యు ఆర్ ఎ హీరో" అంది సుజాత తనకేసి ఆరాధనగా చూస్తూ.

"నీ హీరోనా?" అడిగేడు తను వుత్సాహంగా.

"ఏమో. నేనుమటుకు నీ హీరోయిన్ను కాలేను. అది చెప్పగలను" అంది సుజాత

తలవంచుకుని.

సుజాత ఆలోచనవేరు. తండ్రి పెరాలిసిస్‌తో మంచంమీద వున్నాడు. చెల్లాయి, తమ్ముడు యింకా చాలా చిన్నవాళ్ళు. ప్రస్తుతం సుజాతే ఒక క్లాత్ స్టోర్సులో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తూ, కుటుంబాన్నంతా పోషిస్తుంది. పెళ్ళయి తనమానాన్ని తాను పోతే యీ కుటుంబం గతేమిటా అన్నది సుజాత భయం

అఫ్‌కోర్సు, తనకు ఉద్యోగమంటూ వస్తే సుజాత భయం వదిలించి పెళ్ళాడగలడు. ఆ ధైర్యం తనకుంది. కానీ, తనకు తెలీకుండానే తను సుజాతకు తనపైవున్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాడేమో అన్న బాధ పట్టుకుంది యీ పదిరోజుల్నించీ.

నాలుగేళ్ళ క్రితం బియ్యే పాసయిన తాను యిన్నాళ్ళూ నిరుద్యోగంతో కుస్తీ పడుతున్నాడు. తను పేదవాడని వేరే చెప్పనక్కర్లేదు. పది రూపాయలుంటే గుడ్లు పెట్టే కోడిని కొన్నట్టు నాలుగైదు వేలుంటే ఉద్యోగాన్ని కొనుక్కోవచ్చు కానీ తన దగ్గర ఉద్యోగం కొనుక్కొందుకు కాదుగదా చాలాసార్లు అప్లికేషను ఫారాలు కొనేందుకు కూడా డబ్బుండదు. తనూ, విధవతల్లీ, యిద్దరు చెల్లెళ్ళూ ఎలా బతుకుతున్నారో యింకెన్నాళ్ళు యిలా బతగ్గలరో తనకేనాడూ అర్థంకాలేదు.

స్కూల్లో తనతో కలిసి చదువుకున్న స్నేహితుడు కృష్ణప్రసాద్ పది రోజుల క్రితం హడావిడిగా తన దగ్గరకు వచ్చాడు వచ్చి "మా మామయ్య ఎలక్షన్లలో పోటీ చేస్తున్నాడు. నాతోపాటు నీవు కూడా ప్రచారానికి రావాలి" అంటూ మొదలుపెట్టాడు.

తను తటపటాయిస్తుంటే, "నువ్వేమీ అందర్లాగ కేకలు వేయనక్కర్లేదు. అంకుల్ ప్రచారానికి రెండు వేన్లు పెట్టేడు ఒక వేన్ నీకూ, ఒక వేన్ నాకూ అప్పగిస్తారు. వచ్చిన కుర్రాళ్ళు సక్రమంగా వుండేట్టు చూడ్డమే మనపని ఉత్త సూపర్‌విజన్. అలాగని నీచేత ఉత్తుత్తిగా పని చేయించుకుంటామనుకోకు. రోజుకు ఇరవై రూపాయల్లెక్కన యిస్తాడు. డబ్బు మామయ్యది. నాదికాదు కనుక నువ్వేమీ మొహమాటపడ నక్కర్లేదు. కాలం కర్మం కలిసివస్తే Uncle చేత నీకు ఏదో ఒక ఉద్యోగం యిప్పించే పూచీ నాది" అంటూ పోరుపెట్టాడు

అడిగో ఆ చివరి ఉచ్చుకు దొరికిపోయాడు తను. ప్రసాద్ వాళ్ళ మామ ప్రభావం తనకు తెలీందికాదు. ఇప్పటివరకూ ఆయనకు ఏ పదవీ లేకపోయినా పదవుల్లో వున్నవాళ్ళు ఆయన చుట్టూ చుట్టూ తిరుగుతారని అందరికీ తెలుసు. ఆయన తల్చుకుంటే పది లక్షల రూపాయలు ఒక్క రాత్రిలో అచ్చు గుద్దిస్తాడని అంతకు నాల్గురెట్లు మార్కెట్లో చలామణీ చేయగలడని ఆయన్ని గూర్చి చెప్పుకుంటుంటారు.

అలాటి వాడికి తనఉద్యోగం పెద్ద లెఖ్ఖ కాదు. ఆ కారణంగా తను ప్రసాద్‌గాడి మాటలను నమ్మేడు. నమ్మి ఆ మరునటి రోజు వాడివెంట వాళ్ళ మామ తరపున ప్రచారానికి వెళ్ళేడు

నాల్గురోజులు గడిచినా తనకు పైసా డబ్బు రాలేదు మొదట మొదట్లో ఆ జనంతో కలిసి కాఫీలు ఫలహారాలకు వెళ్ళడం ఎంతో సిగ్గుగావున్నా తర్వాత తర్వాత అదే అలవాటయింది. పేరుకు సూపర్విజన్ అయినా కారుకు సైకులు, బోర్డులు అమర్చడం లాంటి పనులుకూడా తన నెత్తినే పడ్డాయి.

నాల్గో రోజు సాయంత్రం ఊరంతా తిరిగి ఆఫీసుకు చేరేసరికి అక్కడ బోర్డులు తీసివేస్తున్నారు.

కృష్ణప్రసాద్ వాళ్ళ మామ పోటీనుంచి విరమించేసుకున్నాట్ట. గుండె నీరైంది తనకు ఉద్యోగం ఊసు దేవుడికెరుక. ఈ నాల్గురోజులకు తనకు ఎనభై రూపాయలు రావాలి. అవైనాయిస్తే బాగుణ్ణను కున్నాడు తను.

అంకుల్ చీమల సింహాచలంగార్ని బలపరుస్తూ విత్‌డ్రా అయ్యారు కనుక రేపట్నించి మనం ఆయన తరపున కాంపెయిన్ చెయ్యాలి. డబ్బులు కూడా సింహాచలం గారి కార్యాలయం దగ్గరే యిస్తారు రేపు అక్కడ కలవండి' అంటూ అందరికీ చెప్తూ తనవైపు చూసి అర్థమైందా అన్నట్లు కళ్ళెగరేస్తూ స్కూటర్ మీద తుర్రుమన్నాడు కృష్ణప్రసాద్.


ఇక రేపట్నించి తను రానుగాక రానని ఒట్టు పెట్టుకున్నాడతను.

కాని యెనభై రూపాయల ఆశతో తెల్లార్తూనే సింహాచలంగారి కాంపెయిన్‌లో జాయినయ్యేడు

ఇక తన కష్టాలు చెప్పలేదు. అక్కడ కాంపెయినంతా అయ్యాకనే డబ్బులు యిస్తారని అందరూ ప్రతిరోజూ టైంకు వచ్చి తీరాలనీ తేల్చి చెప్పారు. ఇలాగా "అందరికీ కాఫీలకు, భోజన ఫలహారాలకు టికెట్లమటుకు యిస్తాం" అన్నారు. ఆ టిక్కెట్లు పుచ్చుకొని హోటల్లోకూచోడం ఎంత అవమానమో అనిపించింది తనకు. కాని తప్పలేదు.

తననొక రోజు పోస్టర్లు రాయమన్నారు. మరోరోజు యింటింటికీ తిరిగి లిస్టు ప్రకారం ఓటర్లకు నెంబర్లు యిచ్చి రమ్మన్నారు.

మరోరోజు ఒక వందమంది స్త్రీలతో ఊరేగింపు జరిపారు. ప్రక్క ఊళ్ళనుంచి పదీ అయిదూ యిచ్చి లారీల్లో తోలుకొచ్చిన ఆ జనం మధ్యలో ఎటూ వెళ్ళిపోకుండా తననూ మరో నలుగుర్నీ ప్రక్కన కాపలాగా నడవమన్నారు.



దూర మారంగా తను నడుస్తుంటే అందులో ఒకమ్మాయి "దగ్గరగా రావయ్యా ఎగరేసుకుపో" అంది వెకిలిగా నవ్వుతూ. అందరూ తనవేపు చూసి ఎగతాళిగా నవ్వేరు. తల కొట్టేసినట్టైంది తనకు.

తన నిందులోకి లాగిన కృష్ణప్రసాద్ అయిపు లేడు.

ఎలాగోలా చివరదాకా ఓర్చుకోక గత్యంతరం కనిపించలేదు తనకు.

నాల్గురోజుల్నించీ యీ వాన్‌లో ప్రచారం ఈగతి పట్టిందే అని తానేడుస్తుంటే యిదే బ్రహ్మానందపదవి అన్నట్లు తుళ్ళుతున్నారు మిగతావాళ్ళు. సిగరెట్లు, జర్దాలతో కొందరు సర్దాచేస్తుంటే, కొంచెం మందు కూడా పుచ్చుకునితయారౌతున్నారు ఒకరిద్దరు వాళ్ళ ఎకసెక్కాలు, పరాచికాలు, బూతులు - ఈ వాతావరణం తనకు 'సఫొకేటింగ్'గా వుంది.

ఇవేల్టికివాళ తను ఎలెక్షన్ ఆఫీస్ దగ్గరికి వెళ్ళేసరికి కొంచెం ఆలస్యమయింది. అప్పుడే వేన్లు వెళ్ళిపోయాయి. సింహాచలంగారి బామ్మర్ది తన్ను చూశాడు. చూస్తూనే. "అత్తారింటికెళ్ళే అల్లుళ్ళలా వస్తే యెట్టాగయ్యా? ముస్తాబు బాగానే వుంది, కాని టైంకు రావాలిస్వామీ. తినే డబ్బు వంటబట్టాలా? నీ లాటోళ్ళను నమ్ముకుంటే మావోడు మునిగిపోవాల్సిందే

"సర్లే ఆ ఉడిపిహోటల్ కాడికి లగెత్తు టిఫిన్లు అందుతాయి. ఆళ్ళు ఆడ్నించి అంత తొంగరగా కదల్రులే." అంటూ అందుకున్నాడు.

**అప్పుడే వెళ్ళిపోవల్సింది తను ఈ ఒక్కరోజే కదా అన్న ప్రలోభంలో పడి తను అంత అవమానాన్నీ మర్చిపోయి యిందులో కూచున్నాడు. ఇక చాలు.**

ఇవేళ్టితో ప్రచారం అయిపోతుంది. తనకు కనీసం రెండు వందలు రావాలి. తన డబ్బు తనకు పారేస్తే తనిక జన్మలో యిలాటి పనికి దిగడు. ఈ సింహాలూ, పులుల సావాసం ఇక చాలు.

ఆలోచనల్లో కొట్టుకుపోతున్న ప్రకాశం వీపున చర్రుమని చరిచారు ఎవరో. అటు తిరిగి చూశాడు ప్రకాశం తన ప్రక్కన కుర్రాడు కొంచెం మందు మీదున్నట్లున్నాడు. "గురూగారేటి వాళ నోరిప్పకుండా కూచున్నారు" అన్నాడు మందలిస్తున్నట్లు.

ప్రకాశం అందుకున్నాడు:

"సింహం గుర్తుకే మన ఓటుముద్ర."

"వెయ్యాలి."



ఏ పార్టీలోకి దూకబోతున్నావు బ్రదర్ ! —ఫొటో : ఆసురాజేంద్ర

"సింహాచలంగారికే మన ఓట్లు...."

"వెయ్యాలి."

"ఏమిటమ్మా మన గుర్తు....?"

"సింహం గుర్తు," నవ్వు వచ్చింది ప్రకాశానికి 'తమకో గుర్తంటూ వుంటే అది నల్లో. పిల్లో అవుతుంది. కప్పపిల్లో. పిల్లకుక్కో అవుతుంది. పులీ సింహం మటుకు ఛస్తే కాదు'

ఆవేల్టికి ప్రచారం ముగించి వ్యాన్ సింహాచలంగారి కార్యాలయాన్ని చేరింది.

* * *

అక్కడ కృష్ణప్రసాద్ కనిపించేడు. ఇవేల్టినుంచి తను రాలేనని తన సంగతి చూడమని కొంచెం కటువుగానే చెప్పాడు ప్రకాశం.

"సరే నువ్వు నా రూంకి రాత్రి తొమ్మిదింటికల్లా రారా! నీ డబ్బులు యిచ్చేస్తాను" అన్నాడు వాడు. అక్కడ క్యూలో నిలబడి డబ్బు తీసుకోవడం కన్నా యిదే బాగుందనిపించింది.

సరేనని యింటి మొహం పట్టాడు.

* * *

తొమ్మిదవుతూనే ప్రకాశం కృష్ణప్రసాద్ రూమ్ దగ్గరికి చేరేడు. వాళ్ళ అంకుల్ తాలూకు మిల్లు ఒక దాంట్లో అవుట్ హౌస్‌లాంటిది ఆ రూం

ప్రకాశం వెళ్ళేసరికి గేట్‌లోనే పచార్లు చేస్తున్నాడు ప్రసాద్.

"ఏవిట్రా డబ్బు అంత అర్జెంటా? అంత ఠంచన్‌గా వచ్చేవు?" అన్నాడు తమాషాగా నవ్వుతూ. ఏడ్వలేక నవ్వేడు ప్రకాశం.

"నీవు స్కూటర్ నడపగలవు కదా?" **అడిగేడు ప్రసాద్.**

"ఊఁ" అన్నాడు ప్రకాశం.

"అయితే ఒకపని చెయ్యి గురూ. నా ఫ్రెండొకమ్మాయి నా కోసం వచ్చి నా రూంలో వుంది. మేం కాసేపు కబుర్లాడుకోవాలి. ఎవరేనా చూస్తే బాగుండదు నేనిక్కడ తాళం కప్పయిస్తాను. నేను రూంలోకెళ్ళాక నీవు బయట తాళంబిగించి ఒక్క అరగంటసేపు అలా స్కూటర్ మీద తిరిగిరా ఆ తర్వాత ఆ అమ్మాయిని స్కూటర్ మీద వాళ్ళ యింటి దగ్గర దింపేసిరా! నీ డబ్బులు నీవు తీసుకుని చక్కాపోదువు"

ప్రకాశానికి కళ్ళంట నీళ్ళు తిరిగేయి. వాడు తనను ఏం పని చేయమంటున్నాడు?

"లేకపోతే యివ్వవా?" అన్నాడు విసుగ్గా

"చూడు బ్రదర్ నీ డబ్బులు నీకెలాగూ యిస్తాను ఈ కాస్త సాయం చేస్తే ఏం పోయింది? కావాలంటే నీ డబ్బుతోపాటు మరో రెండు వందలు అప్పుగా యిస్తాను. నీకు వీలైనప్పుడు తీసుకువు" అన్నాడు.

నోరు పెగల్లేదు ప్రకాశానికి. మౌనంగా

తాళాలు. స్కూటర్ కీస్ అందుకున్నాడు

* * *

ఓ అరగంట తర్వాత ఆ రూం తాళం తీసి బయట నిలబడ్డాడు ప్రకాశం

ముందు ప్రసాద్. తర్వాత అతని ఫ్రెండ్ బయటకు....

ఆ అమ్మాయి.... కాదు తన సుజాత. తన సుజాత కాదు. తన కలల్నీ, కోర్కెల్నీ నిప్పుల గుండంలోకి నెట్టిన సుజాత ... నిబ్బరంగా అతి మామూలుగా నడిచి వస్తోంది.

అతని గుండె బద్దలైంది. మెదడు మొద్దుబారింది. స్కూటర్ స్టార్ట్‌చేసి ఆమె ఎక్కేందుకు ఆగేడు. నింపాదిగా వచ్చి వెనుకసస్థకూర్చుంది సుజాత స్కూటర్ ముందుకు కదిలింది. ప్రకాశానికి బాలన్స్ కుదరటంలేదు దారి కనుపిస్తున్నట్లు లేదు. యెదురొచ్చే ప్రతి వెహికల్‌కీ తగలబోతున్నాడు. వెంట్రుక వాసిలో తప్పిపోతున్నాయి యాక్సిడెంట్స్.

తప్పినందుకు అతనికి ఏడుపు వస్తోంది.

"సుజాతను చంపేస్తాడు. సుజాతను చంపేసి తనూ చస్తాడు ఏదో వెహికల్‌కు గుద్దేస్తేసరి నోనో. షి యీజ్ గిల్టీ-షి ఎలోన్ షల్ డై. తను సుజాతను చంపేస్తాడు. కులటలకూ ద్రోహులకూ ఎలాటి శిక్ష వేయాలో తను లోకానికి చూపిస్తాడు.

"ఇదివరకిలాగ ఎన్నిసార్లో, బిచ్. వళ్ళమ్ముకొనేది తను. ఎలగేనిదనుకున్న సుజాత వెలయాలుగా తేలింది."

స్కూటర్ ఊరుదాటి హైవేలోకి వచ్చింది ట్రాఫిక్ పల్చబడింది లారీలు, బస్సులు తప్ప జన సంచారం దాదాపు లేనట్లే

తన్ను హలో అంది బిచ్ హలో ఏం చేస్తాడో చూపించాలి.

ప్రకాశం కళ్ళంట నీళ్ళు.

ఎదుట రోడ్ మసకమసగ్గాకనిపిస్తోంది. వెనుకనించి ఏడుపు వినిపిస్తుందేమోనని చూశాడు. ఆశ్చర్యం సుజాత నిర్లిప్తంగా ఎటో చూస్తూ కూచుంది. "షి యీజ్ నాటెషేమ్ ఆఫ్ హర్ సెల్ఫ్. రాస్కెల్ చద్దామని పించడంలేదు కామోసు. బతికి ఎవర్ని ఉద్ధరించాలనో ఏమో యింకెన్ని రూంలు పావనం చెయ్యాలనో.

కాకపోతే మానం లేని ఆడదాన్ని ... మానం అమ్ముకునే దాన్ని ఎవరు పెళ్ళాడతారు.

మానం వున్న మగాడు. మానం కాదు. అభిమానం వున్న ఏ మగాడు దీన్ని పెళ్లాడ్తాడు.

అభిమానం అనేసరికి కలుక్కుమన్నది ప్రకాశం హృదయం. ఎవరు అభిమానం గల వాళ్ళు బ్లాకెట్ కంపెనీల వాళ్ళు బ్రోకర్ కంపెనీ వాళ్ళా?

వాళ్ళకు అమ్ముడుపోయిన తనా?

తను తను ఏం చేశాడు. నాల్గు డబ్బుల కోసం నోరు అమ్ముకున్నాడు. తన చదువును అమ్ముకున్నాడు అభిమానం చంపుకుని కిరాయి ఊరేగింపులు నడిపాడు కిరాయి నినాదాలు చేశాడు.

తల్లి ఎలా సంసారాన్ని యీడుస్తోందో అన్న ఆలోచనేలేకుండా ఉద్యోగం ఉద్యోగం ఉద్యోగం అంటూ వాంటెడ్ కాలమ్స్‌కు అంకితమైపోయాడు తను.

తండ్రినీ తమ్ముళ్ళనీ పోషించేందుకు ఏదో ఒక పని చేస్తున్న సుజాత.

అవును తనను పెళ్ళి చేసుకొనే వుద్దేశం లేదని ఖచ్చితంగా చెప్పింది సుజాత.

తనే ఆమెను పొరబాటుగా అర్థం చేసుకున్నాడు

తనలో ఎవరు మానధనులు?

ఎవరు ఎవరికి తగరు.


"ఆపండి" అంటూ సుజాత అరిస్తే సెన్సెస్‌లోకి వచ్చాడు ప్రకాశం. స్కూటర్ ఆపగానే సుజాత దిగింది. ఊరుదాటి పది మైళ్ళకు పైగా వచ్చారు.

"నేను మిమ్మల్ని మోసం చేశానను కొంటే క్షమించండి. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకొనే వుద్దేశం యెప్పుడో వదిలేశాను. మీతోనూ చెప్పాను. నా పరిస్థితులు."

అవును పరిస్థితులు-తన పరిస్థితులు తననేం చేశాయి! తను సుజాతను వేలెత్తి చూపగలడా

"లేదు సుజాతా లేదు. ఇదొక పెద్దసంత ఈ సంతలో కొనుక్కునేవాళ్ళు వేరు. అమ్ముకునేవాళ్ళు వేరు. కొనేవాళ్ళ దగ్గర డబ్బుకు కొదువలేదు- అమ్ముకునే వాళ్ళకు అన్నీ కరువే! అమ్ముకునేవాళ్ళు ఏదీ దాచుకోలేరు. అలాదాచుకునేందుకు వీలూ వుండదు. ఇళ్ళూ, వాకిళ్ళూ, పొలాలూ పుట్రలూ, వృత్తులూ వ్యాపారాలు, కథలూ, కావ్యాలూ అన్నీ అమ్ముకోవాల్సిందే. అన్నీ అమ్ముకున్నా వాళ్ళ కరువుతీరదు. వాళ్ళ ధనం తగ్గదు అన్ని దినుసులూ అయ్యాక విచక్షణ వుండదు. వళ్ళు అమ్ముకోవాల్సిందే. మనసూ అమ్ముకోవాల్సిందే. ఇందులో ఒకరొకర్ని ఎంచే పనిలేదు. ఈ పాము వాత వద్ద జనంలో ఎవరికెంత విషమెక్కిందీ అన్న మీమాంస అనవసరం. అందరూ బతికివున్న శవాలే. శవాల్లా బతకవలసిన వాళ్ళే.

అతని మనసు తేలిక పడింది. "ఫర్ గెటిట్" అంటూ సుజాత భుజం మీద చేయి వేసి ఊరివైపు నడిపించసాగాడు.




●